# మసిగుడ్డ

ఏదో తెలియని కలవరం !

మరేదో రూపులేని అనుభూతి !

మనస్సు తలుపు తట్టినట్టనిపించగా ఉలిక్కిపడి లేచి కూర్చుంది సీతమ్మ.

హఠాత్తుగా మెలకువ వచ్చిందేమిటా అని తర్కించుకుంది.

అవాళ్టి తిథి గుర్తొచ్చింది. ఆ వెంటనే అది తమ పెళ్లి రోజని జ్ఞప్తి కొచ్చింది.

ముఖంలో ఆనందం గుప్పుమని వెలిగింది.

ఉద్వేగంతో ఊగిపోతూ గబగబా పెట్టె తెరిచింది. పెళ్లినాటి పసుపురంగు జరీచీర బయటకు తీసి చేత్తో తడిమింది. భుజం మీద వేసుకోవాలని బలంగా అనిపించింది గానీ ధైర్యం చాలలేదు. గత ఏడాది వరకూ ప్రతి పెళ్లిరోజునా ఆ చీర కట్టుకునేది. తనూ, ఆయనా ఆ రోజున గతాన్ని నెమరువేసుకునేవారు. గుడికెళ్లి అభిషేకం చేయించేవారు. ఇష్టమైనవి వండుకునేవారు. కనీసం ముగ్గురికి అన్నదానం చేసేవారు.

కానీ ఇప్పుడు ఆయన లేరు. ఆ వైభవమూ లేదు.

నిద్రపోయినవారు నిద్రపోయినట్టుగానే వెళ్లిపోయారు !

దుఃఖం పొంగివచ్చింది. కన్నీళ్లు తుడుచుకుంటూ తడబడుతున్న అడుగులతో హాల్లోకి నడిచింది.

ఆమె కాలు తగిలి టీపాయి కిందపడింది.

"ఎవరూ?" గదిలోంచి అరిచాడు పెద్దకొడుకు.

"నేనేరా అబ్బాయ్!"

"ఏవో కొంపలు మునిగిపోతున్నట్టు ఇంత పొద్దుటే లేవటం ఎందుకూ!" విసుక్కున్నాడు.

ఆమె మనస్సు చివుక్కుమంది. 'నా కొడుకే కదా, పోనీలే!' అని సరిపెట్టుకుంది.

గోడకి తగిలించి ఉన్న భర్త తైలవర్ణచిత్రం ముందు నిలబడింది.

మసక వెలుతుర్లో అస్పష్టంగా కనిపిస్తోంది. అయినా లైటు వెయ్యడానికి సాహసించ లేకపోయింది.

చిత్రాన్ని చేత్తో తడుముతూ ఆయనతో గడిపిన దినాలు నెమరు వేసుకుంది.

అప్పట్లో ఆమె ఆ ఇంటి మహాలక్ష్మేకాదు, మహారాణి కూడా. ఆమె మాటను ఏ విషయంలోనూ కాదనేవాడు కాదామె భర్త. పైగా ఆమె తన భాగ్యదేవతని పొగిడేవాడు. కొడుకులూ కోడళ్లూ కూడా ఆమె అంటే ఎంతో అభిమానంగా ఉండేవారు. ఆప్యాయత కురిపించేవారు.

"అత్తయ్యా! ఏం చేస్తున్నారక్కడ? అవతల కుళాయి వస్తోంది!" పెద్దకోడలు అరిచింది.

"వెళ్తున్నానమ్మా!" గబగబా కళ్లు తుడుచుకుంటూ పెరట్లోకి నడిచింది.

ఇంట్లోకి కావాల్సిన నీళ్లన్నీ పట్టి వీధి వాకిలీ, పెరడూ తుడిచేసరికి ఒక్కొక్కరూ లేచారు.

"సరితా! తెల్లారిపోయిందమ్మా! లేచి ఇల్లు తుడిచి వాకిట్లో ముగ్గుపెట్టు!" చిన్న కోడల్ని ఉద్దేశించి అంది సీతమ్మ.

"ష్... నెమ్మది! తనకి కోపం వస్తుంది!" అన్నాడు చిన్న కొడుకు.

"కోపం ఎందుకురా నేనేం కానిపని చెప్పాననీ!"

"తనకి బద్ధకంగా ఉందిట. రాత్రి టీవీలో సినిమా చూసిందిలే, ఇవాళ్టికి నువ్వు తుడిచెయ్యమ్మా!"

"సరేలే!" చీపురందుకుంది సీతమ్మ. అది చూసి పెద్ద కోడలు అసహనంతో మండిపడింది.

"మీరు ఇల్లు చిమ్ముతూ కూర్చుంటే అంట్లెవరు తోముతారు? ఎవరి పనులు వాళ్ళు చేయాలి! అంతా మహారాణుల మనుకుంటే సేవలు చేయడానికిక్కడ నౌకర్లు లేరు!"అందామె చేతులు తిప్పుతూ.

"నే వస్తున్నాగా! ఈ మాత్రానికి గొడవెందుకు పార్వతీ!"

"అంతేలెండి, ఎంతైనా చిన్న కోడలంటేనే మీ కిష్టం. రేపు ఆవిడే మీకు తవ్వి తలకెత్తుతుందిలెండి!"

"పార్వతీ! కాస్త సుప్రభాతం కట్టిపెడతావా! అమ్మా! కాఫీ!" అన్నాడు పెద్దకొడుకు ముఖం కుడుక్కునొస్తూ.

"ఇదో, క్షణంలో తెస్తాన్రా నాయనా!?" హడావిడిగా వంటింట్లోకి నడిచింది సీతమ్మ.

అందరి కాఫీలూ, టిఫిన్లూ అయ్యేసరికి బారెడు పొద్దెక్కింది.

అప్పటిగ్గానీ స్నానం చెయ్యడానికి తీరిక చిక్కలేదు సీతమ్మకి.

గుడికి వెళ్లొద్దామా అని ఊగిసలాడిందో క్షణం. అయిదోతనం పోయాక గడప దాటలేదని గుర్తొచ్చింది.

చిన్నగా నిట్టూర్చి పూజామందిరంలోనే భర్త చిత్రపటం దగ్గర రెండు అగరొత్తులు వెలిగించి దండం పెట్టుకుంది.

"కాసింత క్షీరాన్నం వండుతాను పార్వతీ! అదంటే మీ మావయ్యగారి కెంతో ఇష్టం!" అభిమానం చంపుకుని అర్థించింది సీతమ్మ.

"చాల్లెండి సంబడం! పిల్ల పెళ్లి చేయటం ఎలారా భగవంతుడా అని మేం ఇదవుతుంటే మీకు పాయసాలు కావాల్సొచ్చాయా?" బుగ్గలు నొక్కుకుంది.

"అది కాదమ్మాయ్... ఇవాళ... ఇవాళ..."

"మళ్లీ ఆ నాన్పుడెందుకూ? పాయసం తినాలనుందని చెప్పొచ్చుగా! సంపాదించే కొడుకులున్నారాయె! ఎన్ని భోగాలైనా కోరతారు మరి!"

"అది కాదు, పార్వతీ..."

"చాల్లెండి, ఒక ముద్ద పడేస్తున్నందుకు సంతోషించక..."

బయటనుంచి వచ్చిన పెద్ద కొడుకు ఆ మాటలు విని భార్యమీద కేకలేశాడు.

"నోర్ముయ్! మా అమ్మని ఒక్క మాటన్నా సహించను ఏమిటనుకున్నావో! అమ్మ మమ్మల్ని కళ్లల్లో పెట్టుకుని పెంచిందే! ఇప్పటికి కూడా ఇంటి పనంతా మీదేసుకుని గాడిద చాకిరీ చేస్తోంది!"

"ఇప్పుడు నేనేమన్నాననీ?"

"ఏమీ అనొద్దు. మా అమ్మే మా అదృష్టం. మా భాగ్యం. అంతే...! దాని మాటలేం పట్టించుకోకమ్మా! నీకేం కావాలిస్తే అది వండుకో! నీకెలా చెయ్యాలనుంటే అలా చెయ్యి! మా బాగంతా నీ చలవేనమ్మా!"

"మా బాబే... మా తండ్రే!" మురిసిపోయింది సీతమ్మ.

మూతీ చేతులూ తిప్పుతూ రుసరుసలాడింది పార్వతి.

"బావగారు మా బాగా బుద్ధి చెప్పారు. లేకపోతే అత్తగారి మీదే పెత్తనం చెలాయించాలని చూస్తుందా?" అంది చిన్నకోడలు సరిత.

పెద్దకొడుకు తమ్ముడ్ని తీసుకుని గదిలోకెళ్లాడు. కాసేపు ఇద్దరూ తర్జన భర్జనలు పడ్డారు.

చిన్న గిన్నెలో వేడి వేడి పాయసం పోసి కొడుకులిద్దరికీ తెచ్చిచ్చింది సీతమ్మ.

"ఇద్దరు కోడళ్లుండగా నీ కెందుకమ్మా శ్రమ! హాల్లో నాన్నగారి ఫోటో పక్కన కుర్చీ వేసుకుని కూర్చో! నీక్కావలసినవన్నీ కాళ్లదగ్గర అమరుస్తారు!" అన్నాడు చిన్నకొడుకు.

"మనింటి పని నాకు భారమేమిట్రా?"

"పాయసం చాలా బాగుందమ్మా! నువ్వు చేసినంత కమ్మగా ఎవరూ చేయలేరనుకో!" మెచ్చుకున్నాడు పెద్ద కొడుకు.

"ఇంకొంచెం పట్రానా!"

"వద్దొద్దుగానీ, నువ్విలా కూర్చోమ్మా, నీతో కొంచెం మాట్లాడాలి!"

"ఏవిటర్రా?" కూర్చుంటూ అడిగింది సీతమ్మ.

"మొన్న నీ మనవరాలిని చూసుకెళ్లారు చూడు, ఆ సంబంధం కుదిరేట్టుందమ్మా! కానీ నలభైవేలు రొక్కం అడుగుతున్నారు. పెళ్లి ఖర్చుల కింకో ఇరవై అన్నా కావాలి కదా! చేతిలో చిల్లిగవ్వలేదు. పిల్ల పెళ్లి ఎలా చేయాలో తోచడంలేదు. నువ్వే సలహా ఇవ్వాలమ్మా!" అన్నాడు పెద్దకొడుకు.

"మీ అత్తవారు పార్వతికి పసుపు కుంకాలకింద కొంత భూమి ఇచ్చారు కదరా! అందులో కొంత ఇస్తే సరి!"

"అవుననుకో, కానీ వాళ్లు రొక్కం కావాలంటున్నారు. తమ్ముడేమో వ్యాపారం పెంచుకోడానికి సొమ్ము కావాలంటున్నాడు. అందుకని..."

"ఇంటిమీద అప్పు చేస్తానంటారా?"

"అప్పు చేస్తే తీర్చడం నా వల్ల కాదు!" అన్నాడు చిన్నకొడుకు.

"మరెలారా? నాకు అనుభవించడానికే గానీ అమ్మే హక్కు లేకుండా చేశారు కదా మీ నాన్న! నా తదనంతరం గానీ అమ్మడం కుదరదు!"

"నువ్వు ఊఁ అంటే అదో అభ్యంతరం కాదమ్మా! కాస్త రేటు తక్కువ వస్తుంది కానీ, కాగితాల్లో ఎన్ని కండిషన్లు ఉన్నా కొనేవాళ్లున్నారు."

"కానీ ఈ ఇల్లు అమ్మనని చేతిలో చేయి వేయించుకున్నారు కదరా మీ నాన్న!"

"ఆయనదంతా చాదస్తం! నిన్ను సరిగ్గా చూడమేమోనని ఆయన భయం. నిన్ను పువ్వుల్లో పెట్టి చూసుకుంటున్నామా లేదా చెప్పు! కన్న తల్లివి నువ్వు కనికరించకపోతే

నా బిడ్డ పెళ్లి కాదమ్మా! నువ్వే పెద్దమనసు చేసుకోవాలి...!" గాద్గదిక స్వరంతో అన్నాడు పెద్దకొడుకు.

"నాకంతా అయోమయంగా ఉందిరా అబ్బాయ్!"

"నీకేం ఫర్లేదమ్మా! నీకు రెండు కళ్లలాంటి మేం లేమా?" అన్నాడు చిన్నకొడుకు.

"కాపురానికొచ్చింది మొదలు ఈ ఇంటికే చాకిరీ చేస్తున్నాను. ఈ ఇంటినుంచే కాటి కెళ్లాలనుందిరా!"

"ఇల్లు అమ్మినా మనం ఇక్కడే ఉంటాం. తిరిగి మనకే అద్దకివ్వడానికి ఒప్పుకున్నారు. నీ ఇష్టాయిష్టాలు నాకు తెలియవా అమ్మా!" అన్నాడు పెద్దకొడుకు.

ఎటూ తేల్చుకోలేక ఊగిసలాడింది సీతమ్మ.

ఒక పక్క భర్తకిచ్చినమాట. మరోపక్క బతిమాలుతున్న కొడుకులు.

కడకి కన్నపేగే జయించింది.

ఇల్లు పరాధీనమయింది.

మనవరాలు మరో ఇంట కాలుపెట్టింది.

* * *

"ఇంటి అద్దె ఒక్కసారిగా పెంచేశారమ్మా! అంత ఇచ్చుకోలేం. అందుకని వేరే ఇళ్లు చూశాం. తమ్ముడూ, నేనూ వేర్లు పడిపోదా మనుకుంటున్నాం!" అన్నాడు పెద్దకొడుకు.

"ఇప్పుడంత అవసర మేమొచ్చిందిరా?"

"మీకు రాలేదేమో గానీ, మా కొచ్చింది!" అంది చిన్నకోడలు.

పరిస్థితి అర్థం కాగా, "పోనీ ఇద్దరూ పక్కపక్కన ఉండేట్లు ఇళ్లు చూడకపోయారా?" అంది సీతమ్మ.

"కుదరలేదమ్మా! ఇక నుంచి ఒక నెల నా దగ్గరా, ఒక నెల తమ్ముడి దగ్గరా ఉందువుగాని."

నడినెత్తిన పిడుగు పడ్డట్టు అదిరిపడింది.

"ఆస్తిని వంచుకున్నారు. ఇప్పుడు నన్నూ..."

"ఒకరే భరించాలంటే కష్టం కదా! కాస్త అర్థం చేసుకో!" అసహనంగా అన్నాడు.

మరి మాటలకవకాశం ఇవ్వలేదు కొడుకులు. పెద్ద ఇంట్లోంచి చిన్న పోర్షన్లోకి మారారు.

పెద్ద కొడుకుతోబాటు వెళ్లింది సీతమ్మ.

భర్త చిత్రపటాన్ని ముందు గదిలో వేలాడదీయాలని ప్రయత్నించింది గానీ కోడలు పడనీయలేదు. పాతసామాన్లు పెట్టిన వసారాలో తన మంచం పక్కనే నిలబెట్టుకోక తప్పలేదు.

ఒక్కసారే పదేళ్లు పైబడినట్టుగా అయిపోయింది సీతమ్మ.

ఓపిక తగ్గడంతో ఇది వరకట్లా పని చేయలేకపోతోంది. ఎలాగో చేసినా అవిడ పనులెవరికీ నచ్చటంలేదు.

నిజానికామె ఉనికే భరించరానిదిగా ఉంది వారికి.

గుండెల్ని తొలిచేస్తున్న బాధని భర్త ఫొటోకి కన్నీటితో నివేదించుకుంటూ రోజులు దొర్లిస్తోంది.

అవాళ ప్రాణం బాగుండక ముందు గదిలో చల్లగా ఉందని కొంగు పరచుకుని పడుకుంది సీతమ్మ.

"ఇక్కడ పడుకున్నావేమిటమ్మా, ఎవరైనా వస్తే బాగుండదు! లోపలకెళ్లు!" విసుక్కున్నాడు పెద్ద కొడుకు.

"గాలి చల్లగా వీస్తోందనీ... వెళ్తున్నాన్లేరా అబ్బాయ్!" అంటూ లేచింది. కళ్లనుంచి జారబోయిన కన్నీటి చుక్కల్ని మధ్యలోనే తుడిచేసింది.

వసారాలో పడుకుంటే మనవడు దోసెడు బొంబాయి సెనగలు తెచ్చిచ్చాడు. వద్దన్నా వినిపించుకోలేదు.

"ఇవి మీ తాతకెంతో ఇష్టంరా!" అంటూ రెండు గింజలు నోట్లో వేసుకుంది. ఉప్పగా తగిలి ఒళ్లు పులకరించింది.

"వీటినెంత ఇష్టంగా తినేవారో...!" అనుకుంటూ వాటిని కొంగున ముడేసుకుని పడుకుంది.

సాయంత్రం కొంగుముడి చూసింది కోడలు. ఆత్రంగా విప్పింది.

"ఇవెక్కడివి? పిల్లల కోసమని డబ్బాలో దాస్తే దొంగతనం చేస్తారా! మీ కింత దొంగబుద్ధి ఉందనుకోలేదు. ఇవాళ ఇదైంది, రేపింకొకటి అవుతుంది! ఈ ఇంట్లో మీరో, నేనో ఒకళ్లమే ఉండాలి!" అంటూ శివాలు తొక్కింది.

సీతమ్మ మాటలెవరూ వినిపించుకోలేదు. అంతా తలో మాటా అనేసరికి బిక్కచచ్చిపోయిందామె.

మహాలక్ష్మిలా ఉందని కోరి కొడుక్కి చేసుకున్న పార్వతి... ఇస్తానన్న కట్నం ఇవ్వలేకపోయినా వియ్యంకుడ్ని క్షమించేసి తెచ్చుకున్న కోడలు... అత్తయ్యా అంటూ తన వెనకెనక తిరిగి పనీ పాటా నేర్చుకున్న పెద్ద కోడలు... ఇవాళ దొంగని చేసింది!

కోడలి ఆరోపణకన్నా "నువ్విలా దిగజారతావనుకోలేదు!" అన్న కొడుకు మాట ఆవిడ గుండెల్లో గునపమై దిగింది.

ఆ రాత్రి అన్నం సహించలేదు. మర్నాడూ అంతే.

"పస్తుల్తో మాడి చచ్చేకన్నా చిన్నకొడుకు దగ్గరకి పోవచ్చు కదా!"

కోడలి మాట నిజం చేస్తూ తన బట్టలూ, ఇంటాయన చిత్రమూ తీసుకుని బయటకు నడిచింది సీతమ్మ.

"సెలవ్వకుండానే వచ్చాశారేం?" గుమ్మంలోనే మూతి ముడుస్తూ దీర్ఘం తీసింది చిన్నకోడలు.

"అబ్బాయి మీద మనసు తిరిగింది!"

"అబ్బో... ఎంత లావు ప్రేమో!"

చిన్న కోడలు ఉంటున్నది మరీ చిన్నవాటాలో. అందుచేత సీతమ్మకంటూ ప్రత్యేకస్థలం లేదు. వంటిల్లు సర్ది అక్కడే చాప వేసుకుని పడుకుంటోంది.

"పిన్నిగారూ!" అంటూ వచ్చింది పక్కపోర్షన్లో ఉంటున్న రమణి. ఆమె, ఆమె భర్తా ఇద్దరూ ఉద్యోగస్తులే.

"పుట్టింటి నుంచి ఎప్పుడొచ్చావమ్మాయ్! ఆడపిల్లట కదా! చాలా సంతోషం! తొలి ఆడపిల్ల సీతాదేవితో సమానమంటారు!" ఆమె సందిట్లోంచి పాపను తీసుకుంటూ అంది సీతమ్మ.

"నాకు సెలవు లేదు పిన్నిగారూ! పాపని చూసుకోడానికెవరూ లేరు. ఈ చుట్టప్రక్కల క్రెష్ కూడా లేదు. పాల సీసా అవీ ఇస్తాను, పాపని కాస్త చూసి పెట్టగలరా?"

పాపవంక చూసింది. బోసి నవ్వులు కుమ్మరిస్తోంది. ఆమె తల్లిపేగు కదిలింది. కానీ కోడలేమంటుందో నన్న భయంతో చిన్న కోడలివంక చూసింది.

"చూస్తార్లెండి, తిని పడుకోవడం తప్ప వేరే పనేం ఉంది గనుక!"

మనస్సు చివుక్కుమంది. రమణి పాపకి కావాల్సినవన్నీ ఇచ్చింది. తమ పోర్షన్ తాళం కూడా ఇచ్చి నిశ్చింతగా ఆఫీసుకెళ్లిపోయింది.

ఇంటి చాకిరీ చేస్తూనే రమణి కూతురి అలనా పాలనా చూస్తోంది. వారు కూడా ఎంతో అభిమానంగా చూస్తుండడంతో త్వరలోనే వారింటి మనిషై పోయింది సీతమ్మ.

"అక్కడో గంతు, ఇక్కడో గంతు వెయ్యకపోతే ఏకంగా అక్కడే ఉండొచ్చు కదా! పనిమనిషి కిచ్చినట్టు వందో రెండొందలో పడేస్తారు కదా!"

కోడలి మాటలకి దుఃఖం పొంగి వచ్చింది సీతమ్మకి.

మనిషికి మనిషి సాయమన్నట్టు చేదోడు వెళ్తే ఎంత మాటన్నది!

ఛీ, వెధవబ్రతుకు!

కుళ్ళిపోయింది, కుమిలిపోయింది.

అవాళ్టి మధ్యాహ్నం "సీతమ్మ తల్లీ!" అంటూ వచ్చాడొకాయన.

ఆమె రూపాన్ని చూసి అప్రతిభుడయ్యాడతడు. కన్నీళ్ళు పెట్టుకుని, "మహాలక్ష్మిలా ఉండేవారు. ఎలా అయిపోయావు తల్లీ! అయ్యగారికప్పుడే నూరేళ్ళూ నిండిపోయాయా?!" అన్నాడు.

"అదృష్టవంతులు గనుకే పెట్టిన చేతులతోనే యాచించాల్సిన స్థితి రాకుండా వెళ్ళిపోయారు. నన్నొంటిని చేసి తన దారి తను చూసుకున్నారు!" ఆమె గొంతు గాద్గదికమయ్యింది.

"నేనెంత దౌర్భాగ్యుడిని... పార్వతీ పరమేశ్వరుల్లాంటి మిమ్మల్ని పిలుచుకెళ్దామని ఎంతో ఆశతో వచ్చాను. నా ఆశ అడియాస అయిపోయింది!"

"మీరు... విశ్వనాథం కదూ?"

"అవునమ్మా! అయ్యగారి చేతి చలువ వల్ల ఓ బతుకుతెరువు సంపాదించుకుని గుట్టుగా బతుకుతున్నవాడిని. అవాళ అయ్యగారు ఆదుకోకపోయి ఉంటే నా పిల్లల్ని అనాథల్ని చేసి అప్పుడే పోయేవాణ్ణి!"

"అలా అనొద్దు. మన చేతుల్లో ఏముంది గనుక...!"

"అంతేలేమ్మా! లేకపోతే మీరు గృహలక్ష్మిలా తిరిగిన ఇంట్లో గృహఖైదీలా మగ్గాల్సొస్తుందా!"

చెళ్ళున కొరడాతో కొట్టినట్టు అదిరిపడింది. తన దుస్థితి గుర్తొచ్చింది. కన్నీళ్ళు వరదై పొంగాయి. అతి కష్టంమీద నిగ్రహించుకుంది.

"నా గొడవకేం గానీ వచ్చిన పని చెప్పారు కాదు!" కళ్ళొత్తుకుంటూ అంది.

"అమ్మాయి పెళ్ళి కుదిరిందమ్మా! మీ చేతులమీదుగా చీర అందుకుందామని వచ్చాను. మీరు కట్టి విడిచిన చీరైనా ఫరవాలేదు. మీ ఆశీర్వాదం అమ్మాయికి లభిస్తుంది!"

గతంలో ఇలా వచ్చిన ఎందరికో కొత్త చీర, పసుపూ కుంకుమా ఇచ్చి పంపేవారు. కానీ ఇప్పుడు తనే మరొకరి దాక్షిణ్యంమీద ఆధారపడిందాయె!

ఆయన మళ్లీ ప్రాథేయపడ్డాడు. పాతచీర ఇవ్వడానికి మనస్కరించలేదు. ఇంతలో పెళ్లినాటి పసుపురంగు జరీ చీర గుర్తొచ్చింది. దానికంతకంటే పరమార్థం లేదనిపించింది.

లోపలికెళ్లి పెట్టె తెరిచింది. చీరలేదు. సంచిలోనూ కనిపించలేదు.

చిన్న కోడల్ని అడిగింది.

"పాత చీరముక్క కావాల్సొచ్చి నేనే తీశాను! నిర్లక్ష్యంగా జవాబిచ్చింది.

"అది నా పెళ్లి చీరే! కొంపదీసి దాన్ని చింపేశావా"

"ఇంకేం చేసుకుంటారు! ఛస్తే కప్పడానికి మీకు పునిస్త్రీ యోగం కూడా లేదాయె!"

నిలువునా నీరైపోయింది సీతమ్మ. "అయితే ఆ చీరని ఏం చేశావు?"

"మసిగడ్డకి గుడ్డల్లేకపోతేనూ చింపేశాను!"

నిలువు గుడ్డేసుకుని చూస్తూ కూలబడిపోయింది సీతమ్మ.

కోడలేం చెప్పిందో గానీ, "వెళ్లొస్తాను తల్లీ!" అంటూ వెళ్లిపోయాడు విశ్వనాథం.

శాపగ్రస్త శిలలా ఎంతసేపు కూర్చుండిపోయిందో ఆమెకే తెలీదు.

"బామ్మగారూ...!" అంటూ వచ్చింది ఎదురింటి మీనాక్షి. "అలా ఉన్నారేం బామ్మగారూ! ఒంట్లో బాగాలేదా, నాకేదో ఆసరా వస్తారని ఆశతో వచ్చాను."

"నాకు బాగానే ఉంది గానీ, ఏమిటో చెప్పమ్మాయ్!"

"మా పనిమనిషి మానేసింది. మీకు తెలుసు కదా బామ్మగారూ, మేం ఇద్దరం ఉద్యోగాలకెళ్లిపోతే బాబును చూసేవారు లేరు. రమణి కూతురుతోబాటు మా బాబునీ చూస్తారనీ ... మీ కష్టం ఉంచుకోం!"

ఆమె చేతుల్లోని బాబు నవ్వాడు.

ఆ పసి నవ్వులు ఉషఃకిరణాల్లా మారి సీతమ్మ మనోవేదనా చీకటిని పటాపంచలు చేశాయి. వెలుగుల తీరానికి దారి చూపాయి.

ఉత్సాహంగా లేచొచ్చి బాబుని సందిట్లోకి తీసుకుని ముద్దు పెట్టుకుంది.

"రమణి కూతుర్నీ, మీ బాబునే కాదమ్మా మరో పదిమంది పిల్లలకి ఆధారమవుతాను. పసిపిల్లల నీడని ఆధరువుగా మలచుకుంటాను. రేపే వేరే ఇల్లు చూసుకుని క్రెష్‌ని ప్రారంభిస్తాను. ఈ దాక్షిణ్యపు బ్రతుక్కి మంగళం పాడేస్తాను!"

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక)

**3.4.2000**